క్లుప్తంగా

శాకంబరిగా నూకాలమ్మ



సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో వేంచేసి యున్న నూకాలమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆషాడ మాసంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరణ చేయడం ఆనవాయితీ. దీనిలో భాగంగా పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించామని ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. పంచారామ క్షేత్రమైన శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి అలంకరణ జరిగింది. అమ్మవారి అలంకరణను పురస్కరించుకొని ఆలయ అర్చకులు సాయి ప్రత్యేక పూజలు చేశారు. నూకాలమ్మ అమ్మవారి అలంకరణను తిలకించడానికి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కూరగాయల ధరలు ఎక్కువగా ఉండటంతో పండ్లకు ప్రాధాన్యత ఇచ్చామని బుల్లియ్య చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

పిఠాపురం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ-క్రాప్ నమోదు ప్రారంభించామన్నారు. రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటలకు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, సీసీఆర్ కార్డు తీసుకుని వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు సమాచారం ఇచ్చి అందరినీ సిద్ధం చేస్తున్నారని తెలిపారు. పీఎం కిసాన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసినందున రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు ఈ నెలాఖరులోగా తమ బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.


ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కోనపాపపేటలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోన పాపపేట జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం కింద భాగం పూర్తిగా శిథిలమైంది. చిన్నపాటి గాలి వేసినా స్తంభం కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీరు కలుషితం



యండపల్లిలో రంగు మారిన తాగునీరు

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో తాగునీరు కలుషితమవుతోంది. వీధి కుళాయిల పైపు లైన్లు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో మురుగు తాగునీటిలో కలుస్తోంది. కొన్ని చోట్ల తాగునీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలోని ప్రధాన పైపులైన్ డ్రైనేజీల కింద ఉండడం, పలుచోట్ల మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కుళాయిల నుంచి జలగలు, క్రిమికీటకాలు, నాచు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీఆర్వోల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ ప్రసాద్

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సర్పవరం వీఆర్వో పాలచర్ల సాయి సత్యనారాయణ ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడలోని గ్రామ రెవెన్యూ అధికారుల భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొన అజయ్ కుమార్, కార్యదర్శిగా అనుపమ, సంయుక్త కార్యదర్శిగా కె.చిన్నారావు ఎన్నికయ్యారు.

కర్షకా.. మేలుకో

- ఖరీఫ్ రైతులకు నకిలీ విత్తనాల బెడద
- ఆఫర్లతో ఎర వేస్తున్న కంపెనీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- నియోజకవర్గంలో 12,087 హెక్టార్లలో సాగు



గోర్సలో విత్తనాలు, ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు



కొత్తపల్లిలో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

కొత్తపల్లి: నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తి చేసిన రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనులు ప్రారంభించారు. పలు గ్రామాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. ఈ సమయంలో పలురకాల కంపెనీల విత్తనాలు, పురుగు మందుల ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌డ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులే సొంతంగా విత్తనాలను తయారు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

డీలర్లకు ఆఫర్లు

విత్తన కంపెనీల యాజమాన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ టూర్లు, ఆఫర్ చేస్తుండడంతో వారు రైతులకు ఎక్కువ మోతాదులో సదురు కంపెనీల విత్తనాలను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌కు వస్తున్నారు. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం ఆ తర్వాత మోసపోవడం షరామామూలైంది.

నియోజకవర్గంలో ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 12,087 హెక్టార్లలో రైతులు వరిసాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో 6167 మంది రైతులు 10264 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచన వేస్తున్నారు.

మోతాదు మించితే ముప్పు

రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో విత్తనాలతో పాటు ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. పురుగు మందుల విషయంలోనూ మోతాదుకు మించి వినియోగించవద్దని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమిలో పోషకాల విలువల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే రైతుల విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదు తప్పకుండా తీసుకోవాలి. రైతులకు పంటల బీమా రావాలంటే విత్తనాలు కొనుగోలు చేసిన రసీదు తప్పనిసరి. ఫెర్టిలైజర్ షాపుల్లో డీలర్లు ఎరువులు, విత్తనాల వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలి. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. ముఖ్యంగా కొనుగోలు చేసిన వ్తితనాలలో 100 గింజలు తీసుకుని మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. సుమారు 80 శాతానికి పైగా మొలకెత్తిన విత్తనాలను మాత్రమే ఉపయోగించుకోవాలి. విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలి.

– వి.జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

మరిడమ్మను దర్శించుకున్న ఆర్డీఓ రామారావు



మరిడమ్మ ఆలయంలో ఆర్డీఓ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆర్డీఓ జేఎస్ రామారావు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వారికి పండితులు ఆశీర్వచనం అందించారు.

రైల్వేస్టేషన్ కిటకిట



ప్రయాణికులతో నిండిన సామర్లకోట రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాం

సామర్లకోట: స్థానిక రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు సెలవులు రావడంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చినవారు తిరుగు ప్రయాణాలకు సిద్ధం అయ్యారు. పెద్దాపురం, కిర్లంపూడి, వేట్లపాలెం, సామర్లకోట, తదితర ప్రాంతాలకు చెందినవారు సామర్లకోట రైల్వే స్టేషన్ మీదుగా రాక పోకలు సాగించవలసి ఉంది. దాంతో ఆయా ప్రాంతాలకు చెందిన వారు తిరుగు ప్రయాణం కోసం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ తీరం



కదలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న యువత

సాగర తీరాన... సండే సమయాన

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. సెలవు రోజు కావడంతో పర్యాటకులు కుటుంబ సమేతంగా బీచ్‌కు వచ్చి సందడి చేశారు. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి వచ్చారు. పర్యాటకుల ఆట, పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఆషాఢ మాసం కావడంతో లోవ దేవస్థానంలోని తలుపులమ్మతల్లిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వీరంతా మధ్యాహ్నం, సాయంత్రానికి సాగర తీరానికి వచ్చి సందడి చేశారు. యువత కదలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మండలంలో జోరుగా వరినాట్లు



ఉండూరు రైల్వే గేటు రోడ్డులో వరి నాట్లు వేస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

సామర్లకోట: మండలంలో జోరుగా వరినాట్లు సాగుతున్నాయి. మండల పరిధిలో 22,250 వేల ఎకరాలల్లో వరి ఖరీఫ్ సాగు జరుగుతుందని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. వెదజల్లు పద్ధతిలో 80 శాతం వరకు సాగు జరుగుతుందని చెబుతున్నారు. కూలీలలో ఖర్చు పెరుగుతున్నా పాడి సంపద ఉన్న వారు గడ్డి కోసం కూలీలతో వరి నాట్లు వేస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కూలీలతో ఆదివారం జోరుగా రైతులు వరినాట్లు వేయించుకున్నారు. ప్రతీ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వెస్టు బెంగాల్ నుంచి కూలీలు వచ్చి నాట్లు వేస్తారని రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ. నాలుగు వేలు చొప్పున కాంట్రాక్టరు తీసుకొని నాట్లు వేస్తున్నట్టు రైతులు తెలిపారు. ఆకు తీత కూడా ఆ కూలీలే నిర్వహిస్తున్నారు. స్థానిక కూలీలతో నాట్లు వేయడానికి ఎకరానికి రూ.ఆరు వేల వరకు ఖర్చు అవుతుందని, ఆకు తీతకు ప్రత్యేకంగా ఒక కూలీ కావలసి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు

పిఠాపురం: పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పిఠాపురం పశుసంవర్ధకశాఖ ఏడీ టీఎస్ రమేష్‌చంద్ర సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గత గురువారం నుంచి పిఠాపురం ఏరియా పశువుల ఆస్పత్రుల్లో పెంపుడు జంతువులకు ర్యాబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. పెంపుడు జంతువులు కరిస్తే మనుషులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిఠాపురం ఏరియా పశువుల ఆస్పత్రుల్లో మరో వారం రోజుల పాటు పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 2002–2003 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సమేళనం జరిగింది. 20 ఏళ్ల క్రితం విద్యార్థులకు బోధన చేసిన ఉపాధ్యాయులు అందరూ ఒకచోట కలుసుకోవడానికి విద్యార్థుల సమేళనం దోహదపడిందని సాయిరామకృష్ణ పేర్కొన్నారు. రాను రాను గురు, శిష్య సంబంధాలు తగ్గి పోతున్నాయని విశ్రాంత హెచ్‌ఎం పాండురంగ విఠల్ అన్నారు. ఉపాధ్యాయులు తమకు చెప్పిన విషయాలు తమ అభివృద్ధికి బాట వేశాయని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. తాము చదువుకున్న పాఠశాల ఎంతో సుందరంగా తయారు కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఆదిరాజు శ్రీరామచంద్ర మూర్తి, సీహెచ్ సూర్యకాంతం, కె.నాగమణి, ఏపీ రాజేంద్రకుమార్, వై.ప్రభాకరరావు, ఎండీ షఫీ, ప్రస్తుతం వివిధ పాఠశాలల్లో హెచ్‌ఎంలు గా పనిచేస్తున్న తోటకూర సాయిరామకృష్ణ, యు.సత్యనారాయణ, టి.శ్యామ్‌సుందర్, పీడీ తాళ్లూరి వైకుంఠంలను విద్యార్థులు సత్కరించారు. నిర్వాహకులు బిక్కిన వెంకట్, వాసపల్లి రత్నకుమార్, బర్లంకి ప్రసాద్, గంగాధర్, ప్రసాద్, రమేష్, వరలక్ష్మీ, భవానీ, ఆవాల నవీన్ కోట్ని శ్రీనివాసులు తమ తమ అనుభవాలను వివరించారు.

ఆకట్టుకొన్న స్థిరాస్తి

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా సాయంత్రం సమాజ సేవకులు టి.రామకృష్ణ జ్యోతి వెలిగించి నాటికల ప్రదర్శన ప్రారంభించారు. ముందుగా కళానికేతన్ (వీరన్నపాలెం) సమర్పణలో ఎస్.వెంకటేశ్వర్లు దర్శకత్వంలో ప్రదర్శించిన 'స్థిరాస్తి' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకొంది. దేశంలో సహాయం చేసేవారి శాతం అనూహ్యంగా పెరిగితే ఆ దేశంలో ఉన్న పేదరికం సమాధి అవుతుందనే సందేశంతో నాటిక సాగింది. అనంతరం మైత్రి కళానిలయం (విజయవాడ) సమర్పణలో టీవీ పురుషోత్తం దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఇతిహాసం' నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. కనిపెంచిన తల్లికి ఆధునిక యుగంలో ఎటువంటి గౌరవం ఇస్తున్నామో నాటికలో కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. మన సంస్కృతికి చిహ్నాలయిన ఇతిహాసాలలో తల్లి పాత్ర ఎంతో కీలమయినదో తెలిసి కూడా మనలో కొందరు తల్లిని గౌరవించడం లేదని ప్రేక్షకులకు వివరించే ప్రయత్నం నాటికలో చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి, వ్యవస్థాప కార్యదర్శి పంపన దయానందబాబు, కృష్ణారెడ్డి, పంపన మురళి పాల్గొన్నారు.

సత్ఫలితాలనిస్తున్న జగనన్న సురక్ష

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. ఆయన పిఠాపురంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. లబ్ధిదారులకు వివిధ కారణాలతో ఆగిపోయిన సర్టిఫికెట్లను ఈ కార్యక్రమం ద్వారా పైసా ఖర్చు లేకుండా ఒక్క రోజులోనే ఇస్తున్నారన్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనెలాఖరు కల్లా అన్ని గ్రామాల్లోనూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అధికారులు ముందుగానే సర్వే నిర్వహించి ఎవరికి ఏ సర్టిఫికెట్ కావాలి, ఏ సమస్య ఉంది అనే విషయాలను గుర్తించడం ద్వారా గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహించే సమయానికి ఆయా సమస్యలు పరిష్కరించిన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. తద్వారా వెను వెంటనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు గొంచాలలో..

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకంలో భాగంగా మండల పరిధిలో గొంచాల గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లు అందజేస్తామని, సర్టిఫికేట్లు అవసరం ఉన్న వారు సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి నవరత్న పథకాలు అందకపోయినా, మధ్యలో నిలిచిపోయినా అర్హులకు పథకాలు అందజేస్తామని తెలిపారు. మణుగులదిబ్బ సచివాలయం వద్ద కూడా సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

హరీష్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

బాలాజీచెరువు: విద్య,వైద్య రంగాలతో పాటు ఆధ్యాత్మికంగా దేవాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు చేయూతనిస్తున్న హరీష్ చారిట్రబుల్ ట్రస్ట్ కార్యక్రమాలు అభినందనీయమని ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. తూరంగి వృద్ధాశ్రమానికి ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, పండ్లు, చీరలు ఆదివారం పంపిణీ చేసి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ ఇటీవలే పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఫిజికల్ టెస్ట్‌కు హాజరైన అభ్యర్థులకు స్పోర్ట్స్ సామగ్రి ఉచితంగా అందజేశామని, అర్హత ఉన్న సరైన సదుపాయాలు లేని వారు తనను సంప్రదిస్తే వారికి తన ట్రస్ట్ ద్వారా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. వీరబాబు, దొరబాబు ,కోటి, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

కాకినాడ సిటీ: మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాకినాడ నగరానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త, సోషల్ వర్కర్ బొజ్జంగి సుధాకర్‌ను నియమిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ వెల్లడించారు. ఆదివారం కాకినాడ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కాకినాడ జిల్లా ఎంఆర్‌పీఎస్ఎస్ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొజ్జంగి సుధాకర్, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడిగా బొమ్మ లక్ష్మణరావు, రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా బొమ్మ రాంబాబు, కాకినాడ జిల్లా ఇన్‌చార్జిగా తాతపూడి మూర్తి, కాకినాడ సిటీ అధ్యక్షుడిగా పలివెల విజయకుమార్, కాకినాడ టౌన్ అధ్యక్షుడిగా విప్పర్తి కుమార్, కాకినాడ జిల్లా కళా చైతన్య దండోరా జిల్లా అధ్యక్షుడిగా మద్దాల రామారావు, కాకినాడ టౌన్ గౌరవాధ్యక్షుడిగా సవరపు నాగరాజు, అనపర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా కాలేటి రామకృష్ణలను నియమించినట్లు బుంగ సంజయ్ తెలిపారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

- వేట్లపాలెం పీహెచ్‌సీలో పలు సదుపాయాలు
- సోలార్ ప్యానల్స్ ఏర్పాటు
- ఎనలైజర్లలో ఎల్ఎఫ్‌టీ సౌకర్యం



వేట్లపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రికి మంజూరైన ఎనలైజర్లు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సోలార్ ప్యానల్స్

సామర్లకోట: మండల పరిధిలోని 18 గ్రామాలలోని ప్రజలకు వైద్యం అందించడం కోసం వేట్లపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే గత తెలుగుదేశం పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై నిర్లక్ష్యం వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో ఆస్పత్రుల పరిస్థితి మెరుగు పడింది. దీనిలో భాగంగా వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో కేవలం ఒక డాక్టరు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఇద్దరు సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. దీనికితోడు ఒక డాక్టరు తరుచూ మండల పరిధిలో హెల్త్ సెంటర్ల పర్యవేక్షణ చేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నారు. గతంలో ఆస్పత్రి ఆవరణ తుప్పలతో నిండిపోయి ఉండేది.

ఆస్పత్రిలో పలు సదుపాయాలు

వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కావలసిన సదుపాయాలతో పాటు సిబ్బందికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా ఆస్పత్రిలో సోలార్ సిస్టమ్ ప్రారంభానికి సిద్ధం చేశారు. నెడ్‌క్యాప్, గెయిల్ సంస్థలు సంయుక్తంగా సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయగా దీనిని నుంచి నెలకు 600 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఆస్పత్రికి కేవలం 400 యూనిట్లు మాత్రమే అవసరం కాగా మిగిలిన 200 యూనిట్లు ట్రాన్స్‌కోకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంది.

అధునాతన ఎనలైజర్ల ఏర్పాటు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని మించి అధునాతనమైన ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, బయో కెమిస్ట్రీ ఎనలైజర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి ద్వారా 30 రకాల పరీక్షలు చేస్తారు. దీనికితోడు లివర్ ఫంక్షన్ టెస్టు(ఎల్ఎఫ్‌టీ) చేయవచ్చు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

సదుపాయాలు మెరుగయ్యాయి



వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు మెరుగుపడ్డాయి. డాక్టర్లు, సిబ్బంది రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గతంలో కొన్ని ఇబ్బందులు ఉండేవి. ఆస్పత్రి ఆవరణలో పూర్తిగా తుప్పలను తొలగించి కొబ్బరి, మామిడి వంటి మొక్కలు వేసి వేలం ద్వారా నిర్వహణ బాధ్యత అప్పగిస్తే బావుంటుంది.

– కొండపల్లి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ, వేట్లపాలెం

ఓపీ తగ్గింది



గ్రామ స్థాయిలో వైద్యం అందే విధంగా ఏర్పాట్లు చేయడంతో వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సంఖ్య తగ్గింది. ఆస్పత్రిలో ఉన్న పరికరాల ద్వారా 30 రకాల పరీక్షలు చేసే అవకాశం ఉంది. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. సోలార్ సిస్టమ్‌కు మీటరు ఏర్పాటు చేయాలి. గతంలో ఆవరణలో తుప్పలు తొలగించాం. ఆస్పత్రి నిధులు రూ.1.60 లక్షలతో బోరు ఏర్పాటు చేయడంతో నీటి సమస్య తీరింది. తరుచూ హెల్త్ సెంటర్ల పర్యవేక్షణ చేస్తాం. అధునాతన ఫ్రిజ్‌ను ప్రభుత్వం అందజేసింది.

– డాక్టరు పి.ప్రశాంత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి, వేట్లపాలెం